# చోతం త్రం

సభలు, సమావేశాలు, ఉపన్యాసాలు-సన్మానాలు—ఎక్కడచూసినా యిదే వార్త—యివే విశేషాలు—ఛీ—రాధ పుస్తకం కోపంగా" విసిరేసింది. ఇల్లు ఊడుస్తున్న ముత్యాలు "ఏమ్మగోరూ ఏటయింది?" ఆశ్చర్యంగా అడిగింది.

"నీబొంద" చిరాగ్గా అంది రాధ—రాధ విసిరేసిన పుస్తకం తీసి యిటు అటు తిప్పి "ఏటుందమ్మగోరూ యిందులో- ఏటిరా సుంది?" కుతూహలంగా అడిగింది ముత్యాలు.

"ఏముంది—మహిళా సంవత్సరం అంటూ పెద్ద కబుర్లు, చేసేదేం వుండదు ఉపన్యాసాలుతప్ప-"

ముత్యాలు కుతూహలంగా చూస్తూ చీపురు కింద పడేసి "అవునండమ్మగోరూ అందరూ ఏటో మయిలా సంవత్సరం అంటారు అనలేటమ్మగోరూ అది—"అంది

"నీ మొహం చెపితే మాత్రం నీకేం అర్థం అవుతుందిలే—పో. నీ పని చేసుకో—" విసుగ్గా అంది రాధ.

సెప్పండమ్మగోరూ"—ముత్యాలు బతిమిలాడుతున్నట్లు కుతూహలంగా అడిగింది.

ముత్యాలుని చూస్తూంటే—పాపం ముత్యాలు అనుకుంది-ఎన్ని మహిళా సంవత్సరాలు జరిపితేనేం, ఎన్ని ఉపన్యాసాలిచ్చినా ముత్యాలులాంటి ఆడదానికేం వొరుగుతుంది! అసలు దేశంలోనూటికి తొభైంతొమ్మిదిమంది ముత్యాలులాంటి ఆడవాళ్ళే! వాళ్ళ గురించి, ఎవరేం పట్టించుకుంటున్నారు. ముత్యాలుకి చదువులేదు. సంస్కారం లేదు. కడుపు నిండా తిండిలేదు. ఈ మహిళా సంవత్సరాలు ఇవన్నీ ముత్యాలుకేం యివ్వగలుగుతున్నాయి! ముత్యాలు మొగుడు ఒక మృగం. వాడి చేతిలో చావుదెబ్బలు తిననిరోజు వుండదు. ఈ ఉపన్యాసాలు యిచ్చే వాళ్ళందరూ ముత్యాలు మొగుడిలాంటి వాళ్ళని మార్చగలరా—ముత్యాలుకి దెబ్బలు తప్పించగలరా? ముత్యాలు ఆ మొగుడిమీద ఆధారపడి బతకడంలేదు-నాలుగిళ్ళల్లో పని చేసుకు పొట్టపోసుకుంటుంది. అయినా ఆ మొగుడిచేతిలో దెబ్బలుతింటూ ఎందుకు నోరు మూసుకు పడివుండాలి—ఈ మగవాళ్ళ జులుం ఎప్పటికిపోతుంది! యిలాంటి

సమస్యలకి పరిష్కారం ఏమిటి—యీమహిళా సంవత్సరంలో జరిపే సభలు, సమా వేశాలలో ఇలాంటి వాటి గురించి చర్చించరేం—ముత్యాలు లాంటి వర్గం ఆడదాని సమస్యలని పట్టించుకోరేం? అవును పాపం అనుకుంది రాధ—తనలాంటి కాస్తో కూస్తో చదువుకున్న వాళ్లకూడా ముత్యాలులాంటి ఆడవాళ్ళని చూస్తూ వూరుకుంటే వాళ్ళ సమస్యలని పరిష్కరించే దెవరు? అట్టడుగున బతికే ముత్యాలు లాంటి స్త్రీలు పైకి తేలేదెప్పుడు?—ఆ ఆలోచన రాగానే ముత్యాలుని సంస్కరించే భారం తన భుజాలమీద వేసుకుంది రాధ. సావకాశంగా మంచంమీద లేచికూర్చుంది. "చూడు ముత్యాలూ అసలు మహిళా సంవత్సరం అంటే ఏమిటో ఎందుకు చేస్తున్నారో తెలుసా—?" తెలీదన్నట్టు అమాయకంగా చూసింది ముత్యాలు.

"ముత్యాలూ-చూడు. ఆడవాళ్ల మగాళ్ళ కన్నా దేన్లో తక్కువచెప్పు-అసలు సంసారం చేస్తుంటే ఆడది మగాడు యిద్దరూ వుండాల్సిందేనా?"

"మరంతే కదండీ—ఆడది లేకపోతే మగాడికి గడుస్తుందా. మొగాడు లేక పోతే ఆడదానికి గడుస్తుందా?—"

"అవును గదా, మరి ఈ మగాళ్ల ఆడదానికి తమతో సమమైన స్థానం యీయకుండా ఎందుకు తమకంటె కింద మెట్టులో వుంచి అణగదొక్కుతున్నారు. ఆడది మగాడి చెప్పు చేతల్లో ఎందుకు పడివుండాలి—ఆడదంటే తన కన్నతల్లి—తన రక్తం పంచుకున్న చెల్లి—కట్టుకున్నభార్య—కన్న కూతురు—అలాంటి ఆడ దాన్ని తమతో సమంగా గుర్తించి గౌరవించకుండా యింట్లో చాకిరిచేసే దాసిగా, పిల్లల్ని కనేయంత్రంగా భావించి తమ గుప్పిటలోవుంచి అధికారం చెలాయించడం న్యాయమేనా—"

"అవునండి" చాలా యింటరెస్టు చూపించుతూ బ్రదుకపింది మెచ్చుకోలుగ. రాధకి అదిచ్చే ప్రోత్సాహం చూసి మరింత ఆవేశం వచ్చింది. "అసలుఆడపిల్లపుట్టిం దంటేనేచుల్కన-అయ్యోఆడపిల్లాఅంటారు నీర్సంగా-ఏం ఆడపిల్లయితే మనిషి కాదా ఆడదిచదవడంలేదా, ఉద్యోగాలుచేయడంలేదా, ఊళ్ళేలడంలేదా—ఆడదిలేకపోతేలోకమే లేదే అలాంటిది యింటికి యిల్లాలిని, కంటికివెలుగయిన ఆడదాన్ని ఈ మగాళ్లగౌరవిం చడం అటుంచి హీనంగా ఎందుకు చూడాలి-ఆడపిల్ల కట్నం యిస్తేగాని పెళ్ళి జర గదు—ఏం మగాడికి పెళ్ళక్కరలేదా? మొగాడు పెళాంచస్తే ఎన్ని పెళ్ళిళ్ళైనా చేసుకోవచ్చు-ఆడది చేసుకుంటే ఘోరాపరాధంలాఎందుకుచూస్తారు? మొగాడు ఎన్ని తిరుగుళ్ళు తిరిగినా తప్పు పట్టనిలోకం ఆడదాని శీలానికి అంత ప్రాముఖ్యం ఎందుకు యిస్తుంది-నీతి నియమాలు అన్నీ ఆడవాళ్ళకే ఎందుకు అంటగట్టారు? ఎవరంట గట్టారు! ఈ మగాళ్ళుకదూ—పతివ్రతల కథలు తయారుచేసి ఆడదెప్పుడూ మగాడి

చేతికింద అణిగి మణిగి పడివుండాలని లేకపోతే పుట్టుగతులుండవని పుక్కిటిపురాణాలు తయారుచేసి ఆడవాళ్ళని నమ్మించి భయపెట్టి తమ చేతికింద వుంచుకుని ఆటలాడుతున్నారు రాధకి ఆవేశంలో మొహం ఎర్రబడింది. ముత్యాలుకేం అర్ధమయిందో, గాని ఏదో కథ వింటున్నంత ఆరాటంగా ఆసక్తిగా కూర్చుంది.

"అవునండమ్మగోరూ—ఆడబతుకంతేగదండమ్మ...."

"ఇదిదో, అలాగే మనం ఎంచేస్తాం, మనబతుకు లింతే అనుకుంటూ నిరుత్సాహ పడకూడదు. అధైర్య పడకూడదు-యీ సంఘంలో మనస్థానం మనం సంపాదించాలి. యివ్వడానికి మానడానికి వాళ్లెవరు? యీ లోకంలో స్త్రీ పురుషులు సమానమని నిరూపించి మన స్థానం మనం పొందాలి."

"అయితే ఏటి సేయాలంటారేటి?"

"అదే, ఉట్టినే సభల్లో ఉపన్యాసాలు యిస్తేనూ, గొంతు చించుకుంటేనూ రాదు—"

"మరెలా వస్తది—" ముత్యాలు ఆశ్చర్యంగా, ఆసక్తిగా అడిగింది.

"అదే చెప్తున్నాను. ఇప్పుడు నాలాంటి వాళ్ళ సంగతి వదిలేద్దాం. నీ సంగతే చూద్దాం. నిన్నెందుకు నీ మొగుడు అలా చావ బాదుతాడు?-"

"ఏటంటే ఏం సెప్పడం, నాఖర్మ—" ముత్యాలు దీనంగా అంది.

"నీ మొహం-నీ ఖర్మకాదు-వాడి వళ్ళు పొగరు-" రాధ కోపంగా అంది- "వాడిలా కొడ్తుంటే నీవెందు కూరుకుంటావు ఏం మొగుడయితే పెళ్లాన్ని కొట్టే హక్కు ఎవరిచ్చారు-అసలు నీవలా మెత్తగా వూరుకోబట్టే వాడలా పెట్రేగి పోతున్నాడు—నీవు ధైర్యంగా తిరగబడి వాడి అహంకారం అణచాలి—" ఆవేశంగా అంది రాధ.

"అమ్మో- అడికి ఎదురుసెప్తే అడికి మరింత తిక్కరేగుద్ది—సంపేస్తాడు ఆ కోపంలో"

"నోరు మూసుకో-నీవలా భయపడడం చూసే వాడలా కొడ్తున్నాడు-అసలు నీవు వాడికెందుకు భయపడాలి. వాడు నిన్నేంపోషిస్తున్నాడా-నీవు నాలుగిళ్ళలో పని చేసుకుని నీ పొట్ట పోసుకుంటున్నావు-నీకు పెట్టడంపోయి నిన్ను తన్ని నీ డబ్బులు లాక్కుపోవడం మగాడి జులుం కాక మరేమిటే—నీవిలా వూరుకుంటే నీగతి యింతే—వాడ్ని లెక్కచేయకుండా ఎదిరించు. కొడితే తిడితే వూరుకోనని బెదిరించు-చచ్చినట్టు లొంగి వస్తాడు, లేదంటే నీవేం బతకలేవా-"

ముత్యాలుకి రాధ వాదన సబబుగానే వుందని పించింది. మొగుడయినంత మాత్రాన తనెందుకు వాడి చేతుల్లో చావు దెబ్బలు తినాలి—ముత్యాలు మొహంలో హావభావాలు పరిశీలిస్తూ రాధ మరింత ప్రోత్సాహంగా—"నేను చెప్పింది అర్థమైందా ముత్యాలూ—వాడీసారి చెయ్యి చేసుకుంటే ధైర్యంగా తిరగబడు—లేదంటే నీజన్మంతా యిలాగే వాడి చేతుల్లో దెబ్బలుతింటూ పడుండు—కాకపోతే ఓ రోజు నేను చెప్పినట్టు చేసిచూడు చచ్చినట్టు లొంగివస్తాడు—ఈ మగాళ్ళు భయపడ్తూంటే మరింత భయపెడ్తారు—"రాధ ముత్యాలుకి నూరిపోసింది. ముత్యాలు అర్థమైందన్నట్టు తలా డించింది రాధకి చాలా సంతోషంగా, గర్వంగావుంది. ఏదో మంచి పనిచేసి, ముత్యాలుని ఉద్ధరించినట్లు. అధో గతిలోబతికే ఒక ఆడదాన్ని ఆదుకుని సహాయ పడి సంస్కరించినట్లు ఆనందపడింది.

• * *

ఆ రాత్రి సింహాచలం యదా ప్రకారం తప్పతాగి యింటి కొచ్చేసరికి అల వాటుగా ముత్యాలు పొయ్యిముందు కూర్చుని అన్నం వండడంలేదు—సింహాచలం కోసం ఉడుకు నీళ్ళకుండ బయట కనపడలేదు. గుడిసెలో నులకమంచంమీద ముసుగు పెట్టేసి పడుకుంది. మధ్యాహ్నం మిగిలిన అన్నం తనింతతిని పిల్లకింత పెట్టేసి—యింట్లో వాతావరణం చూసేసరికి అసలే కైపులోవున్న సింహాచలంకి తిక్కరేగింది. ఒక్కగావుకేక పెట్టాడు ముత్యాలూ అంటూ—ముత్యాలు రోజూలా బెదిరిపోలేదు. వణికిపోలేదు-సావకాశంగా మంచంమీద లేచికూర్చుని "ఏటి" అంది.

"ఏటే మంచం ఎక్కి తొంగున్నావు ఉడుకు నీళ్ళేవి-" అరిచాడు.

"కఱ్ఱపుల్లల్లేవు మంటెట్టడానికి" నిర్వికారంగా అంది ముత్యాలు.

"లేవూ—ఎల్లు దేగెల్లి పట్టుకొచ్చి నీళ్ళు కాగబెట్టు—" కోపంతో ఊగి పోయాడు.

"నాకాడ డబ్బున్నేవు" మొండిగా అంది ముత్యాలు.

"డబ్బుల్లేవూ—ఏరంకు మొగుడి కెదుతున్నావు ముండా, కూడుకూడా వొండనేదా" అంటూ ముందుకు వురికి జుత్తు పట్టుకున్నాడు సింహాచలం.

ముత్యాలు విసురుగా వదిలించుకుని తీవ్రంగా చూసింది. "నన్నొగ్గు—మీద సెయ్యేసేస్తే వూరుకోను. డబ్బులిస్తే కూడొండుతా, లేదంటే ఈరోజు కడనించి వండను—తెగేసిఅంది ముత్యాలు—సింహాచలం ఒక్క క్షణం నోట మాటలేకుండా విచిత్రంగా ముత్యాలేనా అన్నట్టు అనుమానంగా చూశాడు—కాని ముత్యాలు కళ్ళల్లో తిరస్కారం చూశాక సింహాచలంకి ఆవేశం ఆగ్రహం ముంచుకువచ్చింది. ఎగిరి ముత్యాలు మీదపడి నడ్డివంచి ఫెడీ ఫెడి గుద్దాడు-జుట్టు పట్టుకుపీకాడు, గోడకేసి

బుర్ర కొట్టాడు, కాలితో కుమ్మాడు, అందిన చోటల్లా చితక బొడుస్తూ—"ఏటే వంజా గోరోజనం బలిసిందా—ఎవుడి ననుకుంటున్నావే-నీ మొగుడ్ని—కూడొం డవూ—ఎల్లు ఎల్లి కర్రపుల్లలట్టుకొచ్చి నీళ్ళు కాగబెట్టి, కూడొండు-నోరిప్పావంటే ఎముక లేరేస్తా—జవాబు సెప్పావంటే పచ్చడిచేసి నంజుకుతినేస్తా—" బండ బూతులుతిట్టాడు.

"ఓరి నచ్చినోడూ—నీ చేతులిరగ... సిగ్గునేదురా ఆడకూతురు తెచ్చిన కూడు మింగుతూనే కొడ్తావురా" ముత్యాలు ఏడుస్తూ తిట్టసాగింది. ముత్యాలు అరుస్తున్న కొద్దీ సింహాచలం మరింత చితక బొడిచాడు. ముత్యాలు ఆఖరికి యింక తాలలేక ఏడుస్తూ కూలబడింది—"ఊ—లే—వళ్ళు, తీట వదిలిందా-లే, కూడెట్టు—" సింహాచలం అలిసిపోయి మంచానికి అడ్డం పడ్డాడు. ముత్యాలు ఏకిలుకు ఆకిలు కూడ దీసుకుంటూ మొద్దయిన వళ్ళుని పొయ్యిముందుకు చేర్చింది.

* * *

తెల్లారి ఏడుగంటలయినా రాని ముత్యాలు కోసం పదిసార్లు కాలుగాలిన పిల్లిలా తిరిగింది రాధ—ఏడుగంటలు దాటాక అంట్లు గిన్నెలు ముందేసుకు తోమ డానికి కూర్చుంది ముత్యాలుని తిట్టుకుంటూ రాధ—"దొంగముండ—ఎప్పుడూ ఏదో వంకతో ఎగగొడ్తుంది-అన్నీ దొంగవేషాలు యిదీనూ—అందుకే ఆ మొగుడు చితక్కొడ్తాడు—వూరికే కొడ్తాడా, కావల్సిందే దానికి...." పరపర గిన్నెలు తోముతూ కసిగా తిట్టింది రాధ—

★

(మ హి ళ)

# తల్లి హృదయం

క్రొడుకు దగ్గరనుంచి ఉత్తరం అందుకున్న కామేశ్వరమ్మ మనసు శరీరం భూమ్మీద నిలవడం మానేశాయి. మూడేళ్ళ తర్వాత పెళ్ళయ్యాక ఇన్నాళ్ళకి కోడలు, మనవరాలుతో ఇంటికి వస్తున్నాడు. ఒక్కగానొక్క కొడుకు ఇంజనీరింగు ప్యాసయ్యాక భిలాయి స్టీలుప్లాంటులో ఉద్యోగం దొరకడంతో వెళ్ళినవాడు మళ్ళీ ఇంటికి వంటరిగా రాలేదు. తనతోపాటు ఇంజనీరింగు చదివిన బెంగాలీ అమ్మాయిని